క్లుప్తంగా

ఆర్టీసీ డ్రైవర్‌కు అవార్డు



నర్సంపేట : నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేతిడి అశోక్‌రెడ్డి నర్సంపేట–హనుమకొండ–ఉప్పల్ విధులు నిర్వర్తించి తొలిసారి 6.18 కేఎంపీఎల్ సాధించగా ఆయన్ను డీఎం ప్రసూనలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ భవానీ, ఎంఎఫ్ పాపిరెడ్డి శుక్రవారం శాలువాతో సత్కరించి అవార్డు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజారుల వేదమంత్రోచ్చారణల నడుమ భక్తులు పూజ చేశారు.

విషజ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి



నర్సంపేట : పట్టణంలో డెంగ్యూ, ఇతర విషజ్వరాల నివారణకు మున్సిపల్, ఆరోగ్య శాఖలు చర్యలు చేపట్టాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలో రెండ్రోజుల క్రితం తొమ్మిదేళ్ల వయస్సుడైన బాలుడు మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని డ్రైనేజీలు, రోడ్లపై చెత్త పేరుకుపోవడం, జనావాసాల్లో చెట్లు పెరిగి దోమలకు నిలయంగా మారుతున్నట్లు తెలిపారు. ఇకనైనా వీధుల్లో, డ్రైనేజీల్లో, పాఠశాలల ఆవరణల్లో, జనావాసాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరారు.

పాకాలలో ఘర్షణ

ఖానాపురం : మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాకాలలో పర్యాటకులు, సిబ్బంది నడుమ శుక్రవారం సాయంత్రం ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. పాకాలకు వన భోజనాల కోసం వచ్చిన పర్యాటకులను సాయంత్రం వేళ గేటు వద్ద ఉన్న సిబ్బంది చీకటి పడుతున్న నేపథ్యంలో వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే పర్యాటకులు, సిబ్బంది దాడులకు దిగడంతో గేటు వద్ద ఉన్న సిబ్బందికి గాయాలై కుర్చీలు ధ్వంసం అయినట్లు సమాచారం. సెల్‌ఫోన్లు అపహరణకు గురైనట్లు సిబ్బంది తెలిపారు. సీఐ కిషన్‌ను వివరణ కోరగా స్వల్ప ఘర్షణ చోటు చేసుకుందని, విచారణ చేస్తున్నామని చెప్పారు.

యువత భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



నెక్కొండ : యువత భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సీఐ హథీరాంనాయక్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేషుడి శోభాయాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వినాయకుడికి సీఐ హథీరాంనాయక్, ఇతరులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువత యూత్ గౌరవ అధ్యక్షుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, అధ్యక్షుడు శ్రీరంగం సంపత్, సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్ పాఠశాల క్రీడాకారులకు శుక్రవారం టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయ మాట్లాడారు. ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడాపోటీల్లో పాల్గొననున్న విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు అతడి తండ్రి మురళీధర్‌రావు స్మారకంగా 25 టీ షర్టులు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మమత, మాధవి, మురళి, కృష్ణ, మోహన్‌రావు, పీఈటీ రవీందర్‌రావు, జాహిద్, చింతకింది ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి'

నల్లబెల్లి : అర్హులందరికీ గృహలక్ష్మి పథకాన్ని మంజూరు చేయిస్తామని ఎంపీపీ ఊడుగుల సునీత తెలిపారు. మండలంలోని కన్నారావుపేట, మామిండ్ల వీరయ్యపల్లి గ్రామాల్లో ఆ పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకాన్ని పేదలందరూ వినియోగించుకోవాలని, లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు వెంటనే లక్ష రూపాయలు బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తంగెళ్ల నిర్మల, అమరేందర్, ఎంపీటీసీ ఏడాకుల రవీందర్ పాల్గొన్నారు.



నల్లబెల్లి : నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ



దుగ్గొండి : పనులను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

దుగ్గొండి : మండలంలోని శివాజీనగర్‌లో గృహలక్ష్మి పథకం ఇళ్ల నిర్మాణ పనులను పీఏసీఎస్ చైర్మన్ సుకినే రాజేశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి 458 ఇళ్లు మంజూరు చేశారని, త్వరలోనే మరో 400 ఇళ్లు మంజూరు చేస్తారని తెలిపారు. పేదలు పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి ఉమ రవీందర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తోటకూరి రాజు, నాయకులు సుకినె శ్రీనివాస్, రక్షమాని శ్రీనివాస్, శంకర్‌రావు, నర్సింగరావు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు కృషి

ఖానాపురం : రైతుల శ్రేయస్సు కోసం సొసైటీ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నట్లు ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మహాజన సభ సమావేశంలో ప్రగతి నివేదికలు, ఖర్చులను సీఈఓ ఆంజనేయులు వెల్లడించారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం చైర్మన్ రామస్వామి మాట్లాడారు. సమస్యలను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏడాదిలోగా పరిష్కరిస్తామని తెలిపారు. వర్షాకాలంలో రైతులే స్వయంగా ధాన్యం తరలించేలా కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయడానికి చొరవ తీసుకుంటానని చెప్పారు. సొసైటీ స్థలాల్లో షాపింగ్ మాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సొసైటీకి జాతీయ రహదారి వెంట బుధరావుపేటలో ఉన్న భూముల్లో హెచ్‌పీ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సొసైటీ ఆధ్వర్యంలో అమూల్ కంపెనీ షేర్లను కొనాలని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు, వినయ్, భీమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ రామస్వామి

పరిసరాల శుభ్రతలో ప్రజలు కీలకం

నల్లబెల్లి : పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ప్రజలు కీలకమని మేడపల్లి, నల్లబెల్లి వైద్యాధికారులు శశికుమార్, ఆచార్య తెలిపారు. 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో భాగంగా నాగరాజుపల్లిలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు చేశారు. నల్లబెల్లిలో 'స్వచ్ఛత హి సేవా'పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధర్మేందర్, సంతోశ్, డాక్టర్ నవీన్, సూపర్‌వైజర్లు దామోదర్‌రెడ్డి, రజని, హెప్సీబ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆచార్య

కుటీర పరిశ్రమలతో ప్రగతి



సంగెం : కుటీర పరిశ్రమలు స్థాపించడం ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతి సాధించొచ్చని ఎంపీపీ కళావతి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన శాంతి మండల సమాఖ్య వార్షిక మహాసభలో ఆమె మాట్లాడారు. బ్యాంకు రుణాలను వినియోగించుకుని సకాలంలో తిరిగి చెల్లించి ఆర్థికంగా ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కళ్యాణి, కార్యదర్శి రాజమణి, కోశాధికారి రేణుక, ఎంపీటీసీ మల్లయ్య, ఏపీఎం దుంపేటి కిషన్, సీసీలు స్వరూపరాణి, కుమరస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

సంగెం : విద్యార్థులు ప్రతిభ చాటి జోనల్‌స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని గవిచర్లలో సంగెం, పర్వతగిరి మండలాల జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో అండర్–14, అండర్–17 కేటగిరీల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను జిల్లాస్థాయికి పంపిస్తామని జోనల్ కార్యదర్శి పెద్దిరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దొనికెల రమ, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం రమాదేవి, పీడీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి

భిక్షాటనతో అంగన్‌వాడీల నిరసన

వర్ధన్నపేట : తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు పట్టణంలో శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల మాట్లాడారు. సమ్మె చేపట్టి 19 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చర్చలకు పిలవాలని, సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై పోలీసులతో, అధికారులతో ఒత్తిడి తీసుకురావడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో మరింత పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

వర్ధన్నపేట : ఇళ్లు కోల్పోయిన బాధిత దళితులకు ఎమ్మెల్యే అరూరి రమేష్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఇచ్చిన హామీని అమలు చేయలేదంటూ జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు వెడల్పులో దళితుల ఇళ్లను కూల్చి వేయగా వేరే చోట ఇళ్ల నిర్మాణం చేయిస్తామన్న హామీని విస్మరించారని పేర్కొన్నారు. బాధిత దళితులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధి పేరుతో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారని, అడ్డుకున్న దళిత నాయకులను అరెస్టు చేయించారని పేర్కొన్నారు. బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కమిషన్‌ను కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నెక్కొండ: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యోదయ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న మండలంలోని అలంకానిపేట హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు చైతన్య, జునైద్, నితిన్, వీరన్న, రాజ్‌కుమార్, సిద్ధు, రిత్విక్, సాయి అవినాష్, శశాంక్, ప్రణవ్, శివసాయి, సహస్ర, జాహ్నవి, అనూష, ప్రణస్విక, హరిప్రియ, హారిక, యమున, కృష్ణప్రసన్న, రాజేశ్వరి, వాహిని, సిరిచందన, వైష్ణవి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సికింద్రాబాద్ బొల్లారంలోని వీలీరన్ గ్రామర్ హై స్కూల్‌లో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లు షరీఫ్, నందు, పీఈటీ అఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ నాగార్జున్‌రెడ్డి, తదితరులు

ఉద్యమకారుల చేతిలోనే రాజకీయ సమాధి

● బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

సంగెం : బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన తర్వాత అణచివేతకు గురైన ఉద్యమకారుల చేతిలోనే రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి రాజకీయ సమాధి తప్పదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తెలిపారు. మండలంలోని కుంటపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ధర్మారెడ్డితో టీడీపీలో పని చేసిన వారికి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అనుచరులకు మాత్రమే పదవులు ఇచ్చి బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారిని విస్మరించారని విమర్శించారు. ఊరు ఏకమై గతంలో మొత్తం ఓట్లు వేసిన వరికోలు ప్రజలు ధర్మారెడ్డిని వ్యతిరేకిస్తుండడం చల్లా పతనానికి అద్దం పడుతోందని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ పరకాలలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజలను ఓటు యంత్రాలుగా బీఆర్‌ఎస్ పార్టీ భావిస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, నాయకులు జక్క చేరాలు, శేషాద్రి, సమ్మిరెడ్డి, కృష్ణ, రహమతుల్లా, వీరయ్య, చంద్రమౌళి, సతీశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్

ఖానాపురం : బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడెంతండా సర్పంచ్ గుగులోతు తారమ్మ, అదే తండాకు చెందిన గుగులోతు కిషన్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండడంతో వారిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడు బోయిన అయిలయ్య (56) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆయన అనారోగ్యం బారిన పడగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. కాగా శుక్రవారం తెలవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అయిలయ్య మృతదేహానికి సర్పంచ్ పెండ్యాల మమత, పంచాయతీ కార్యదర్శి ముక్కెర ఆనంద్ నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి వారు తక్షణసాయంగా పంచాయతీ నుంచి రూ.10 వేలు అందించారు. అలాగే సర్పంచ్ వ్యక్తిగతంగా, సీపీఎం గ్రామ కమిటీ తరఫున రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. అయిలయ్య మృతదేహానికి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్, మండల అధ్యక్షుడు ముస్కు రాజు, నాయకులు శ్రీరామోజు భిక్షపతి, మాదాసి సదయ్య, తాటికాయల కుమారస్వామి సందర్శించి నివాళులర్పించారు.



దుగ్గొండి : నగదు ఇస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

వర్ధన్నపేట : సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. డయల్ 100, వాహన సేఫ్టీ, రోడ్డు భద్రత నియమాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఆయన తెలిపారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బ్యాంకు అధికారినంటూ ఫోన్ చేసి ఖాతా సమాచారాలను తస్కరించి క్షణాల్లో డబ్బులు ఖాళీ చేసే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ, ఇతరులకు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాదాలు, ఇతర ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. వాహనదార్లు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

సంక్షిప్త సమాచారం

ఈజీఎస్‌ను వినియోగించుకోవాలి

పర్వతగిరి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఈజీఎస్)ను పేదలు వినియోగించుకోవాలని సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్‌రావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన లేబర్ దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘు, ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మొట్టు రాజును అతడి తల్లి సరోజన (65) మృతి చెందగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత సరోజన మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతోపాటు సర్పంచ్ వక్కల మల్లమ్మ, ఎంపీటీసీ ఒడేల విజయ, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

నర్సంపేట : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గిరిగాని రవిచందర్‌గౌడ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నాయకులు శుక్రవారం పార్టీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు..

చెన్నారావుపేట : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణుడు, హరిత విప్లవ పితామహుడు ఎమ్‌ఎస్.స్వామినాథన్ చిత్రపటానికి సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు ఘనంగా నివాళులర్పించారు. స్వామినాథన్ మృతి చెందిన నేపథ్యంలో పాఠశాలలో ఆయన చిత్రపటానికి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడారు. స్వామినాథన్ మృతి తీరని లోటన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగదీష్, కృష్ణమోహన్, వేణు, రాజు, గణేష్, కుమార్, కోటేశ్వర్, రమేశ్, విష్ణు, కవిత, గీత, పద్మ, శిరీష, రజిత, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో చిక్కుడు మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి వివేకానంద ట్రస్ట్ ప్రతినిధులు 50 కేజీల బియ్యం సాయంగా అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మడిపెద్ది నాగార్జున, ప్రధాన కార్యదర్శి బండి రాజుయాదవ్, మడిపెద్ది నరేష్, బండి రఘుయాదవ్, గోగుల అనిల్, మెరుగు గణేష్, మెరుగు ప్రశాంత్, మడిపెద్ది రితీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నర్సంపేట : నేడు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రసూనలక్ష్మి ప్రకటనలో తెలిపారు. సెల్ నంబర్ 9959226052, 7382926166లకు ఫోన్ చేయాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

వర్ధన్నపేట : పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు వయోవృద్ధులకు సన్మానం

నర్సంపేట : అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో రేపు (అక్టోబర్ 1న) 75 ఏళ్లకుపైబడి వయస్సులైన సుమారు 15 మంది వయోవృద్ధులను సన్మానించనున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వయోవృద్ధులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నెక్కొండ : మండల కేంద్రంలో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కుడికాల రఘువీర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫొటోగ్రాఫర్లందరూ ఎక్స్‌పోకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వినోద్, ఉపాధ్యక్షుడు నవీన్, కోశాధికారి సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ నేతల త్యాగం ఆదర్శప్రాయం

నల్లబెల్లి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (ఎన్డీ) కేంద్ర కమిటీ సభ్యులుగా పని చేసి అమరులైన ముక్తార్ పాషా, చంద్రమల త్యాగం ఆదర్శప్రాయమని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో ముక్తార్ పాషా మూడో వర్ధంతి సభల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. పాషా వర్ధంతి సభలను అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లస్వామి, లక్క సాంబయ్య, పెద్దకాసు మల్లయ్య, రవి, మేకల రవి, ఆలేటి వెంకన్న, బాబు, మల్లన్న, దనసరి సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేసిన ముక్తార్‌పాషా మూడో వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను ఐఎఫ్‌టీయూ నర్సంపేట ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు బరిగెల కుమార్, ఏశబోయిన ఐలయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం కుమార్, ఐలయ్య మాట్లాడారు. అల్లిగూడెంలో వర్ధంతి సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు భిక్షపతి, రాజు, శ్రీను, అశోక్, శేఖర్, రవీందర్, యాకాంబ్రం, తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

పర్వతగిరి : అమరుల త్యాగాలు మరులేనివని సర్పంచ్ వర్కాల రమేష్ అన్నారు. అమరులైన దాస్యం ఆళ్వారు, దాస్యం రంగయ్య, దాస్యం తిరుపతయ్య, రాయబారపు లక్ష్మీపతి, పిల్లలమర్రి వెంకటేశం, అల్లాడి రామయ్య, బోయినపల్లి వెంకటరామయ్య, బోయినపల్లి ఎల్లయ్య, పాకాల రామయ్య కుటుంబ సభ్యులతో మండలంలోని కొంకపాక, చౌటపల్లి గ్రామాల్లో తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమృత కలశ యాత్రలో సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరిమిల్ల మోహన్‌రావు, మురళీకృష్ణ, వేణు, నసీరుద్దీన్, తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, పర్వతగిరి ఉపతపాలా కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : అమృత కలశ యాత్రలో సిబ్బంది

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో 'మేరీ మిట్టి–మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు నాగెల్లి కొంరయ్య, తపాలా శాఖ పర్యవేక్షకుడు నర్సింహస్వామి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ అన్వేష్, దుగ్గొండి ఏపీఎం అనుదీప్, బీపీఎం బోదె ప్రభాకర్‌రెడ్డి, ఎంటలు సుమన్, రాజబాబు పాల్గొన్నారు.

విలువలతోనే భవిష్యత్‌కు బాటలు

వర్ధన్నపేట : మానవ విలువలు పాటిస్తేనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోగలరని సామాజిక కార్యకర్త బంక మాణిక్యరావు తెలిపారు. పట్టణ పరిధిలోని నీల గిరిస్వామి తండా అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మాణిక్యరావు మాట్లాడారు. విద్యార్థి దశ నుండే మానవ విలువలు పెంపొందించడం ద్వారా క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దగలమని చెప్పారు. తల్లిదండ్రులను, గురువులను పూజించాలని విద్యార్థులకు సూచించారు. పాటలు, నృత్యాల ద్వారా పిల్లలకు అవగాహన కల్పించారు.

